సాక్షి
మహబూబాబాద్
ఆదివారం । 28 । మే । 2023



వర్సిటీల పాత్ర కీలకం

ఉన్నత విద్యలో విశ్వవిద్యాలయాల పాత్ర కీలకంగా ఉండాల్సిన అవసరం ఉందని న్యాక్ పీర్ టీం చైర్మన్ ప్రొఫెసర్ సుగమ్ అన్నారు. - 8లో▸



తెలంగాణను దోచుకుంటున్న కేసీఆర్

రాష్ట్రాన్ని కేసీఆర్ కుటుంబం అక్రమ, ఆర్థిక సామ్రాజ్య విస్తరణకు దోచుకుంటున్నారని ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
41.5^0 / 26.5^0

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండి వడగాలులు వీస్తాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఓటరు జాబితా సిద్ధం చేయాలి



కురవి: బీఎల్‌ఓలు ఓటరు జాబితాను సిద్ధం చేయాలని తొర్రూరు ఆర్డీఓ ఎల్.రమేష్ అన్నారు. శనివారం సీరోలు, కురవి మండలాలకు సంబంధించిన బీఎల్‌ఓల సమావేశం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ, మార్పులు, చేర్పుల జాబితాపై అవగాహన కల్పించారు. రానున్న ఎన్నికల్లో ఎలాంటి తప్పులు లేకుండా సంపూర్ణ ఓటర్ల జాబితా తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కురవి ఇన్‌చార్జ్ తహసీల్దార్ రఫీ, సీరోలు తహసీల్దార్ విజయ్‌కుమార్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఖోఖో టీం కోచ్‌గా రామయ్య



గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారానికి చెందిన పొడాల రామయ్య మహబూబాబాద్ జిల్లా ఖోఖో పురుషుల జట్టు కోచ్‌గా నియమితులయ్యారు. ఈమేరకు ఆ జిల్లా డీఈఓ రామారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 28 నుంచి 31 వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర సీఎం కప్ పోటీల్లో మహబూబాబాద్ జిల్లా జట్టుకు కోచ్‌గా రామయ్య సేవలందిస్తారు. ఆయన ప్రస్తుతం కేసముద్రం(గ్రామం) జెడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.

ఉద్యమకారుల సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలి



మహబూబాబాద్: ఇరువై వేల కోట్లతో ఉద్యమకారుల కోసం సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమ నాయకుడు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో పూర్తయిన అమర వీరుల స్థూపాన్ని శనివారం ఉద్యమకారులు సందర్శించారు. ఉద్యమకారుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంతన్‌రామరాజు మాట్లాడుతూ ఉద్యమకారులను గుర్తించి ప్రతి నెలా గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అమరుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో ఉద్యమకారులను భాగస్వాములు చేయాలన్నారు. మానుకోట జిల్లా కేంద్రంలోనే ఎత్తైన అమర వీరుల స్థూపాన్ని ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గుంజె హన్మంతు, రాంమూర్తి, విక్రం, సురేష్, శ్రీనివాస్, యాకయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను వివరించాలి

కేసముద్రం: ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను పార్టీ శ్రేణులు ప్రజలకు వివరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాచకొండ కొమురయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి జన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 29 నుంచి జూన్ 30 వరకు ప్రతి గ్రామంలోని వెళ్లి సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పొదిల నర్సింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లభు వెంకటేశ్వర్లు, గాంతి వెంకట్‌రెడ్డి, కొమ్మాల వెంకట్‌రెడ్డి, రామడుగు వెంకటాచారి, రడం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లో ఇద్దరి అరెస్టు

నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం

మహబూబాబాద్ రూరల్: ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నారనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించి ఇద్దరు యువకులను అరెస్టు చేశామని మహబూబాబాద్ టౌన్ ఎస్సై ఎస్.రవి శనివారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయగా ఏడుగురు యువకులను గుర్తించామన్నారు. వారిలో ఖమ్మంకు చెందిన దొంతగాని మహేష్, బానోత్ గణపతిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు, లక్షా 5 వేల నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మల్లిదే వీరప్రసాద్, దాసరి ఉపేందర్, జాల లింగరాజు, నరాల నరేష్, గుండు ఉపేందర్ పరారీలో ఉన్నారన్నారు. వారిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని ఆయన పేర్కొన్నారు.

నిల్వలపై నిఘా!

- సీఎంఆర్ పెట్టడంలో మిల్లర్ల నిర్లక్ష్యం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జిల్లా, రాష్ట్ర అధికారులు
- విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్, కలెక్టర్ వరుస తనిఖీలు
- సీఎంఆర్, నిల్వల వివరాల సేకరణ
- ధాన్యం లేకనే సీఎంఆర్ ఆలస్యమైందని ఆరోపణలు



కేసముద్రంలో రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

సాక్షి, మహబూబాబాద్: రైతుకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి రైస్‌మిల్లులకు వెళ్లి ధాన్యం.. మిల్లింగ్ చేసి సివిల్ సప్లయీస్, ఎఫ్‌సీఐకి పెట్టాల్సిన బియ్యం కొందరు మిల్లర్లు జాప్యం చేస్తున్నారు. వీరి జాప్యానికి అనేక రకాల ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వరకు మిల్లుల్లో నిల్వ ఉన్న ధాన్యంపై నిఘా పెట్టారు. గత వారం రోజుల నుంచి జిల్లాలోని రైస్ మిల్లులపై విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ కూడా పలు మిల్లులకు వెళ్లి నిల్వలు పరిశీలిస్తున్నారు.

సీఎంఆర్ జాప్యం

మిల్లర్లకు ఇచ్చిన ధాన్యం సీఎంఆర్ పెట్టడంతో పలువురు మిల్లర్లు మొండికేస్తున్నారు. 2021–22 యాసంగిలో జిల్లాలోని 18 మిల్లులకు 93,456.240 మెట్రిక్ టన్నుల ధాన్యం ఇచ్చారు. 2022–23 వానాకాలంలో 1,56,735 మెట్రిక్‌ల ధాన్యం పెట్టగా 1,05,012 మెట్రిక్ టన్నుల బియ్యం సీఎంఆర్ పెట్టాలి. ఇందులో గత యాసంగిలో మిల్లర్లు 63,495.714 మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి పెట్టాలి. కానీ ఇప్పటి వరకు 48,267 మెట్రిక్ టన్నులు గ్రేడ్–ఏ రకం, 1,764 మెట్రిక్ టన్నుల కామన్ రకం మొత్తం 50,031 మెట్రిక్ టన్నుల బియ్యం సీఎంఆర్ పెట్టారు. మిగిలిన 12,990 మెట్రిక్ టన్నుల గ్రేడ్–ఏ రకం, 269 మెట్రిక్ టన్నుల కామన్ రకం బియ్యం సీఎంఆర్ పెట్టాల్సి ఉంది. ఇందులో తొమ్మిది రైస్ మిల్లులు పూర్తిగా సీఎంఆర్ పెట్టగా.. ఐదు రైస్ మిల్లులు కొంత మేరకు సీఎంఆర్ పెట్టాలి. కానీ మిగిలిన ఐదు మిల్లుల్లో రెండు మిల్లులు వంద, ఆపై ఏసీకేలు, రెండు మిల్లులు యాభై ఏసీకే మేరకు, మరో మిల్లు ముప్పై ఏసీకేల వరకు పెట్టాల్సి ఉంది. ధాన్యం ఇచ్చి సంవత్సరం అయినా సీఎం ఆర్ పెట్టకపోవడంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిల్వలపై అనుమానం

మిల్లర్లు సకాలంలో సీఎంఆర్ పెట్టకపోవడంపై పలు ఆరోపణలు వస్తున్నాయి. యాసంగిలో పెట్టిన ధాన్యం తాలూకు సీఎంఆర్ పెట్టక పోవడం ఏంటని రాష్ట్ర ఉన్నతాధికారులు ప్రశ్నిస్తున్నారు. జిల్లాలోని ఐదారు మిల్లుల యజమానులు మాత్రం అధికారులు మాటలు చెవున పెట్టడం లేదని విమర్శలు ఉన్నాయి. ఇందుకు కారణం దిగుమతి చేసుకున్న ధాన్యం ఇతర మార్కెట్‌లో అమ్మి సొమ్ముచేసుకున్నారని, వీటి స్థానంలో రేషన్ బియ్యం పెట్టేందుకు ప్రయత్నించి విఫలమైనట్లు ప్రచారం. విషయం పసిగట్టిన అధికారులు మిల్లుల్లో ఉన్న నిల్వలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. అయితే గతంలో కూడా సకాలంలో సీఎంఆర్ పెట్టకుండా ఉన్న మిల్లర్లకు ధాన్యం పెట్టొద్దు. కానీ సివిల్ సప్లైలోని ఓ అధికారి మిల్లుల పేర్లు మార్చడం, ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించి ధాన్యం పెట్టినట్లు సమాచారం. దీంతో గతంలో ఆరోపణలు ఉన్న మిల్లులే ఎక్కువగా సీఎంఆర్ పెండింగ్‌లో ఉందని అధికారులు చెబుతున్నారు. షూరిటీ పెట్టిన వాళ్లు ఇప్పుడు చేతులు ఎత్తేస్తున్నారని, ఈ పరిస్థితిలో మిల్లర్లపై సీఎంఆర్ పెట్టించడం అధికారులకు తలకు మించిన భారంగా మారింది.

వరుస తనిఖీలు

కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తీసుకున్న మిల్లులు సకాలంలో సీఎంఆర్ పెట్టకపోవడం, జిల్లాలో రేషన్ బియ్యం దందా యథేచ్ఛగా సాగుతుందనే ఆరోపణల నేపథ్యంలో గత పదియేను రోజుల నుంచి జిల్లాలోని పలు రైస్‌మిల్లులను అధికారులు తనిఖీలు చేస్తున్నారు. ఇటీవల కంబాలపల్లి మిల్లును విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేశారు. మిల్లులో నిల్వలపై ఆరా తీసినట్లు తెలిసింది. రికార్డులు పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేసినట్లు సమాచారం. అదేవిధంగా సీఎంఆర్ ఆలస్యంపై ఆగ్రహించిన కలెక్టర్ శశాంక అయ్యగారిపెల్లి రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంత ధాన్యం దిగుమతి చేసుకున్నారు, ఎంత మొత్తంలో సీఎంఆర్ పెట్టారు, ఇంకా పెట్టాల్సింది ఎంతా? అని ఆరా తీసినట్లు తెలిసింది. సీఎంఆర్ జాప్యంపై కలెక్టర్ మిల్లర్లపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. అదేవిధంగా శనివారం సివిల్ సప్లయీస్ రాష్ట్ర విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం జిల్లాలో పర్యటించింది. అనంతారం శ్రీనివాస మిల్లు, కేసముద్రం ఓం సాయి మిల్లును, ముడుపుగల్లు ధాన్యం కొనుగోలు కేంద్రాలు తనిఖీలు చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఎలా సాగుతుంది. తేమ, దూళి శాతం, కోత మొదలైన అంశాల గురించి సెంటర్ నిర్వాహకులు, రైతులను అడిగి తెలుసుకున్నట్లు తెలిసింది. రైస్ మిల్లుల్లో నిల్వ ఉన్న ధాన్యం, వాళ్లు పెట్టాల్సిన సీఎంఆర్ వివరాలు తెలుసుకోవడం, రికార్డులు కూడా తీసుకున్నట్లు తెలిసింది.



సీఎంఆర్ వేగవంతం చేస్తున్నాం



గత యాసంగిలో దిగుమతి చేసిన ధాన్యంలో సగానికి పైగా మిల్లులు సీఎంఆర్ పెట్టారు. సీఎంఆర్ ఆలస్యం చేస్తున్న మిల్లర్లతో మాట్లాడాం. వేగం పెంచాలని ఆదేశాలు జారీ చేశాం. ఈ నెలాఖరు వరకు గత యాసంగి సీఎంఆర్ పెండింగ్ లేకుండా చూస్తాం. మిల్లుల్లో తరచుగా తనిఖీలు జరుగుతూనే ఉంటాయి. వారు ఇచ్చే నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయి.

-ఎం. డేవిడ్, అదనపు కలెక్టర్

‘ఉపాధి’ బిల్లుల చెల్లింపుల్లో అక్రమాలు!



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న దయాకర్‌రావు

మహబూబాబాద్ రూరల్: ఉపాధి హామీ పనులు జరిగిన అంశాల్లో కూలీలకు బిల్లుల చెల్లింపు ప్రక్రియను సంబంధిత సిబ్బంది ఇష్టారాజ్యంగా నిర్వహించారని సామాజిక తనిఖీ ప్రజావేదికలో డీఆర్‌పీలు వెల్లడించారు. ఉపాధి హామీ పథకం 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక మహబూబాబాద్ ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మూడో రోజు కొనసాగింది. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజావేదిక ప్రిసైడింగ్ ఆఫీసర్ (అడిషనల్ డీఆర్‌డీఓ) డీవీ దయాకర్‌రావు సమక్షంలో సామాజిక తనిఖీ బృందం డీఆర్‌పీలు సేకరించిన వివరాలను వెల్లడించారు. 2019 డిసెంబర్ 1వ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై చర్చించారు. మస్టర్లు, వర్క్‌ఫైళ్లు లేకుండా బిల్లులు ఇచ్చిన అంశాలపై ఆగ్రహం వ్యక్తం చేసి బాధ్యులు జరిమానాలు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆదివారం కూడా సామాజిక తనిఖీ ప్రజావేదిక కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ జిల్లా విజిలెన్స్ అధికారి బండి గోవింద రావు, గ్రీవెన్స్ ఆఫీసర్ ఆడెమ్స్, ఎంపీడీఓలు వెంకటేశ్వర్లు, రవీందర్, ఏపీఓలు పార్థసారథి, రమేష్, రమేష్‌రెడ్డి, స్టేట్‌టీం సభ్యులు వేణు, ఎస్‌ఆర్‌పీలు సురేష్‌బాబు, నర్సయ్య, ప్రదీప్, రమేష్, టీఏలు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి



మాట్లాడుతున్న మల్లారెడ్డి

మహబూబాబాద్ అర్బన్: కోర్టు స్టే ఎత్తివేయించి ఉపాధ్యాయుల పదోన్నతుల, బదిలీల ప్రక్రియను వేగవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మల్లారెడ్డి అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కారించాలని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి హైదరాబాద్ ఇందిరపార్కు వద్ద నిరసన చేస్తున్న సందర్భంగా మానుకోట జిల్లా కేంద్రంలోని అమర వీరుల స్థూపం వద్ద శనివారం యూటీఎఫ్ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి ఎస్.మల్లారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. ఈ కుబేరు, పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని, ఈ విద్యా సంవత్సరానికి పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని, కేజీబీవీ ఉద్యోగ, ఉపాధ్యాయులను రెగ్యులర్ చేసి కనీస వేతనం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు షేక్ యాకుబ్, హుస్సేన్, మంజుల, సురేష్, శ్రీనివాస్, రెహమాన్, ప్రసాద్, హరి, లక్ష్మయ్య, సత్తార్, శ్రీదేవి, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో జిల్లాను అగ్రగామిగా నిలపాలి



జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

మహబూబాబాద్ అర్బన్: క్రీడల్లో జిల్లాను అగ్రగామిగా నిలపాలని జిల్లా అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శనివారం సీఎం కప్ క్రీడలకు ఎంపికైన క్రీడాకారుల వాహనాన్ని జిల్లా అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు, ఈ నెల 28 నుంచి 31 వరకు హైదరాబాద్ గచ్చిబౌలి, ఎల్‌బి స్టేడియం, సరూర్ నగర్, జింఖానా గ్రౌండ్, కెవీబీఆర్, యూసుఫ్ గూడ స్టేడియంలో రాష్ట్ర స్థాయిలో సీఎం కప్ క్రీడా పోటీల్లో పాల్గొంటారన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి అనిల్, కోచ్‌లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల రక్షణకు అండగా ఉంటాం

మహబూబాబాద్: బాలల హక్కుల రక్షణకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎల్లప్పుడు అండగా ఉంటుందని సీనియర్ సివిల్ జడ్జి సురేష్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సీనియర్ సివిల్ జడ్జి జిల్లా కేంద్రంలోని బాలసదన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల రక్షణ కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తోడ్పాటు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్మన్ నాగవాణి, సిబ్బంది పాల్గొన్నారు.

వినూత్న కార్యక్రమాలు చేపట్టాలి

- కలెక్టర్ కె.శశాంక



మాట్లాడుతున్న కలెక్టర్ కె.శశాంక

మహబూబాబాద్: తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత సాధించిన ప్రగతిని ప్రజలకు తెలియచేసేలా వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ కె.శశాంక అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జూన్ 2 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే దశాబ్ది ఉత్సవాలు గ్రామ గ్రామాన నిర్వహించేందుకు అధికారులతో కలెక్టర్ ప్రణాళిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని సంబంధిత శాఖలు తమ శాఖపరిధిలో కార్యక్రమాలను రూపొందించుకోవాలన్నారు. సమావేశాలు ఏర్పాటు చేసి గతంలో ప్రభుత్వ అభివృద్ధి తీరును ప్రస్తుత అభివృద్ధి పని తీరును వివరంగా చెప్పాలన్నారు. జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం, 3న తెలంగాణ రైతు దినోత్సవం, 4న పోలీస్ శాఖచే సురక్ష దినోత్సవం, 5న తెలంగాణ విద్యుత్ విజయోత్సవం, 6న పారిశ్రామిక ప్రగతి, 7 సాగునీటి దినోత్సవం, 8న మత్స్యశాఖ దినోత్సవం, 9న ఆసరా ఫింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కార్యక్రమాలు, 10న ప్రభుత్వ సుపరిపాలన దినోత్సవం, 11న కవి సమ్మేళనాలు, 12న తెలంగాణ రన్, 13న తెలంగాణ మహిళా సంక్షేమ దినోత్సవం, 14 వైద్య ఆరోగ్య దినోత్సవం, 15 పల్లె ప్రగతి దినోత్సం, 16న పట్టణ ప్రగతి, 15న జీపీల్లో జాతీయ పతాక ఆవిష్కరణ,పట్టాల పంపిణీ, 18 మంచి నీళ్ల పండుగ, 19న హరితహారం, 20న విద్యాదినోత్సం, 21 ఆధ్యాత్మిక దినోత్సం, 22న అమర వీరుల సంస్మరణ కార్యక్రమంలో భాగంగా అమరులకు నివాళులర్పించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, ఎం డేవిడ్, జెడ్పీ సీఈఓ రమాదేవి, డీఆర్‌డీఏ పీడీ సన్యాసయ్యా, ఆర్డీఓలు కొమురయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం బస్తాలు మిల్లులకు తరలించాలి



గూడూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

గూడూరు: వర్షాలు కురిసే పరిస్థితులు నెలకొంటున్నందున త్వరగా కొనుగోలు ధాన్యం బస్తాలను మిల్లులకు పంపించాలని అడిషనల్ కలెక్టర్ డేవిడ్ అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలు తడువకుండా జాగ్రత్త పడాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా డబ్బులు వారి అకౌంట్‌లో జమ అయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

డెత్ రిపోర్టు ఉంటేనే ఓటును తొలగించాలి

మహబూబాబాద్: ఓటును తొలగించేందుకు మరణ ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా ఉండాల్సిందేనని అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ స్పష్టం చేశారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో ఓటర్ల జాబితాపై విచారణ చేపడుతున్న పలు అంశాలను సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్షించారు. దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి నిర్ణయం తీసుకోవాలన్నారు. సమీక్షలో ఆర్డీఓలు కోమురయ్య, రమేష్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ ఉత్తర్వులు జారీ

నెహ్రూసెంటర్: జిల్లా వైద్యారోగ్యశాఖ పరిధిలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న 22 మంది హెల్త్ అసిస్టెంట్లు (మేల్), 8 మంది ఫార్మసిస్టులు, ముగ్గురు ల్యాబ్ టెక్నీషియన్లకు క్రమబద్ధీకరణ ఉత్తర్వులను డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.హరీష్‌రాజ్ శనివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అంబరీష, ఆఫీస్ సూపరింటెండెంట్ రవికుమార్, ఐసీ డిప్యూటీ డెమో కేవీ రాజు, హెచ్‌ఈ పురుషోత్తం, డీపీఓ రుక్ముద్దీన్ పాల్గొన్నారు.

చిత్రం.. సజీవ సాక్ష్యం

- మధుర జ్ఞాపకాల ఫొటోలు
- ఆధునిక టెక్నాలజీతో ఆల్బమ్‌లు
- మార్కెట్‌లో కొత్తకొత్త డిజైనింగ్‌లు
- ఖర్చుకు వెనకాడని ఫొటో ప్రియులు
- తీపి గుర్తులుగా ఛాయచిత్రాలు

వంద అక్షరాలు, మాటలను ఒక్క ఫొటోలో చూడగలం. జీవిత సత్యాలను, మానవ జీవన విధానాన్ని ఒక్క ఛాయ చిత్రం సంపూర్ణంగా ఆవిష్కరిస్తుంది. చూడగలిగితే ప్రకృతిలో ఉండెంత అందం మరెక్కడ ఉండదు. అలాంటి అందాలను బంధించేది, చెదరని జ్ఞాపకం, మధుర స్మృతుల కలబోత ఫొటోగ్రఫీ. పెళ్లిళ్లు, జన్మదిన వేడుకలు, నామకరణం ఇలా వేడుక ఏదైన ఆ స్మృతులను నెమరు వేసుకునే అవకాశం కల్పించేవి ఫొటోలు. ఫొటో ప్రియులు సైతం ఆధునిక టెక్నాలజీకి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. పెళ్లిళ్లు, బర్త్‌డే వేడుకల్లో ఫొటోలు, ఆల్బమ్‌లకు రోజురోజుకు క్రేజ్ పెరుగుతుంది. ఒకరిని చూసి మరొకరు వివిధ రకాల ఫొటో డిజైన్లతో ముందుకువస్తున్నారు. ఫొటో ఆల్బమ్‌లపై సండే స్పెషల్ స్టోరీ మీకోసం.

-మహబూబాబాద్ అర్బన్



ఫొటో ఆల్బమ్ ప్రింట్లలో రకాలు..

గ్లాసీ, నాన్‌టెరబుల్, మ్యాట్, సిల్క్, వెల్‌వెట్, త్రీడి, గ్లీటర్, మోటాలిక్, ఎంబోస్, ప్రాన్స్‌పరెంట్, పేపర్ మెటాలిక్, హైగ్లాసీ రకాలు ఉంటాయి. కొన్ని ఆల్బమ్‌ల సంస్థలు ల్యాబ్‌లు వారిచ్చే సర్వీస్ బట్టి ఆదరణ పొందుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెడిన్ కలర్ ల్యాబ్, ఇతర ల్యాబ్‌ల్లో కరిజ్మా, లైట్‌వేట్ గ్లాసీ, నాన్‌టెరబుల్, మ్యాట్, సిల్క్, త్రీడి పలు రకల ప్రింట్‌లు అందుబాటులో ఉండి వివిధ రకాల డిజైన్‌లతో ఆల్బమ్‌లు ఫొటో ప్రియులకు అందిస్తున్నారు.

Sunday Special



వివిధ రకాల డిజైనింగ్ ఫొటోలు

లైట్‌వెయిట్ టు సైడ్ ప్రింటింగ్..

లైట్‌వెయిట్ టు సైడ్ ప్రింటింగ్: ఇందులో టెరబుల్, నాన్ టెరబుల్, గ్లాసీ, మ్యాట్ సిల్క్, వెల్‌వేట్, గ్లీటర్, మోటాలిక్, ఎంబోస్, ప్రాన్స్‌పరెంట్, పేరల్ మోటలిక్, హైగ్లాసీ, ప్రింట్ రకాలు ఉన్నాయి. ప్రస్తుతం ఇలాంటి ప్రింటింగ్‌కు ఆదరణ పెరుగుతోంది.

మధుర స్మృతి..



గడిచిన కాలాన్ని గుర్తు చేసుకుంటూ నలుగురితో పంచుకునే అవకాశం కల్పించేది. ఇంతకుముందు ఫిలీం నెగిటివ్ ఉండేది. ఫొటో గ్రాఫర్లు ఫొటోలు తీసిన తర్వాత నెగిటివ్‌లను ల్యాబ్‌లో స్కాన్ చేసి సీడీ, డీవీడీలో, ఆల్బమ్‌లు, ఫొటో ప్రింట్‌లు వేసివడం జరిగేది. ప్రస్తుతం డిజిటల్ కెమెరాలు, డిజిటల్ ప్రింట్స్ వచ్చాయి. అన్ని రకాల ఆల్బమ్‌లు అందుబాటులో ఉన్నాయి.

-దుంపేటి లక్ష్మణ్, రెడిన్ కలర్ ల్యాబ్ నిర్వహకుడు

ఫొటోలు అద్భుతం



ఫొటోగ్రఫి అనేది మహా సముద్రం లాంటిది. కరిగేకాలంలో చెదిరిపోని స్మృతులకు ప్రతిబింబాలు ఫొటోలు. అలనాటి జ్ఞాపకాలను మళ్లీ మళ్లీ తనివి తీరా వీక్షించుకునే అవకాశాన్ని ఇచ్చే తీపి గుర్తులు ఫొటోలు. ఇంతటి పరిజ్ఞానం వెనుక ఎందరో శాస్త్రవేత్తల అధ్యాయనాలు, పరిశోధనలు, నిరంతర కృషి దాగి ఉంది. ఆ మహనీయులను ఏడాదికోసారి గుర్తు చేసుకుంటాం.

-గార రవిచంద్రబోస్, సీనియర్ ఫొటోగ్రాఫర్, మానుకోట

ధాన్యానికి నిప్పంటించి ఆందోళన



ధాన్యం బస్తాకు నిప్పంటించి నిరసన తెలుపుతున్న రైతులు

కేసముద్రం: ధాన్యం కొనుగోలులో జాప్యం చేస్తూ, మిల్లుల వద్ద తేమసాకుతో బస్తాకు 4 కేజీల తరుగు తీస్తూ రైతులను మోసగిస్తున్నారంటూ శనివారం మండలంలోని కాట్రపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధాన్యం బస్తాలకు నిప్పంటించి రైతులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పీసీసీ సభ్యుడు గుగులోతు దస్రూనాయక్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు తోట వెంకన్న మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో అమ్మకానికి తీసుకువచ్చిన ధాన్యానికి కాంటాలు పెట్టక, కాంటాలు పూర్తయిన బస్తాలను ఎగుమతి చేయకపోవడంతో రోజుల తరబడిగా రైతులు పడిగాపులు పడాల్సివస్తుందన్నారు. ఇక్కడి నుంచి కరీంనగర్ మిల్లు వద్దకు లారీలో ఎగుమతి చేసిన ధాన్యంను, తేమసాకుతో తరుగు తీస్తూ రైతులను మోసగిస్తున్నారంటూ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో యాకాంబ్రం, సిరికొండ మల్లయ్య, పుట్టప్రభాకర్, సంపత్, అహల్యాదేవి, శీలం నీలమ్మ, ఐలయ్య, లాల్‌సింగ్, యాదగిరి, చంద్రయ్య, వీరునాయక్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో దివ్యాంగుడి ఆత్మహత్య


రాజు(ఫైల్‌)

సంగెం: పుట్టినప్పటి నుంచి కాళ్లు చచ్చుబడిపోవడంతో ప్రతి చిన్న అవసరానికి తల్లిదండ్రులపైనే ఆధారపడాల్సి వస్తున్నదనే మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన దివ్యాంగుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌ జిల్లా సంగెం మండలంలోని తిమ్మాపూర్‌ గ్రామానికి చెందిన కాగితాల లక్ష్మి, ధర్మయ్యల చిన్న కుమారుడు రాజు(36) పుట్టుకతో రెండు కాళ్లు చచ్చుబడిపోయి నడవలేని పరిస్థితి. మానసిక పరిస్థితి కూడా అంతంత మాత్రమే. దీంతో కాలకృత్యాలతో పాటుగా ప్రతి పనికి తల్లిదండ్రులపైనే ఆధారపడుతుండేవాడు. ఈక్రమంలో తల్లిదండ్రుల సాయం లేనిదే ఏ పని చేసుకోలేకపోతున్నానని మధనపడుతుండేవా డు. తల్లిదండ్రులు ధైర్యం చెప్పినా తాను మాత్రం బాధపడుతూనే ఉండేవాడు. ఈ నెల 26న తల్లిదండ్రులు ఓ ఫంక్షన్‌కు వెళ్లగా ఇంట్లో ఒంటరిగా ఉన్న రాజు జీవితంపై విరక్తితో గడ్డిమందు తాగాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు గమనించి వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా శుక్రవారం రాత్రి మృతి చెందాడు. రాజు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భరత్‌ తెలిపారు.

ఉరి వేసుకుని మహిళ..

కామేపల్లి(కారేపల్లి): కుటుంబ కలహాల నేపథ్యంలో మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం నెమలిపురికి చెందిన లకావత్‌ సుమలత(28)కు మహబూబాబాద్‌ జిల్లా గార్ల మండలం బీఆర్‌ఎస్‌ తండాకు చెందిన వ్యక్తితో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉండగా, మూడు రోజుల క్రితం కుటుంబంలో గొడవలు జరగడంతో సుమలత నెమలిపురిలోని పుట్టింటికి వచ్చింది. అప్పటికే సునీత తల్లిదండ్రులు దైవ దర్శనం కోసం తిరుపతి వెళ్లారు. దీంతో తన పిల్లలను తీసుకురావాలని బంధువులను సునీత బీఆర్‌ఎస్‌ తండాకు పంపించగా పిల్లలను పంపేది లేదని భర్త చెప్పడంతో తిరిగొచ్చారు. దీంతో మనస్తాపానికి గురైన సుమలత ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది.

ఉన్నతవిద్యలో వర్సిటీల పాత్ర కీలకం

- న్యాక్‌పీర్‌ టీం చైర్మన్‌, మాజీ వీసీ సుగమ్‌ఆనంద్‌
- కేయూలో ముగిసిన న్యాక్‌ పీర్‌ టీం పర్యటన

కేయూ క్యాంపస్‌: ఉన్నతవిద్యలో విస్తృతమైన మార్పులు రాబోతున్నాయని, కావున విశ్వవిద్యాలయాల పాత్ర కీలకంగా ఉండాల్సిన అవసరం ఉందని నేషనల్‌ అసెస్‌మెంట్‌ అక్రిడిటేషన్‌ (న్యాక్‌) పీర్‌ టీం చైర్మన్‌ ఉత్తరప్రదేశ్‌ రాష్ట్రంలోని ఆగ్రాలోని అంబేడ్కర్‌ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్‌ సుగమ్‌ఆనంద్‌ అన్నారు. న్యాక్‌ టీం చైర్మన్‌ సుమమ్‌ ఆనంద్‌తోపాటు మరో ఆరుగురు సభ్యుల బృందం మూడు రోజులుగా కాకతీయ యూనివర్సిటీలో వివిధ విభాగాలు, కళాశాలలు, హాస్టళ్లు, మెస్‌లు, హెల్త్‌ సెంటర్‌ను పరిశీలించారు. అకాడమిక్‌, పరిశోధన, ప్రాజెక్టులు, మౌలిక వసతులు ఎలా ఉన్నాయనే అంశాలపై అధ్యయం చేశారు. శనివారం సాయంత్రం కేయూ పరిపాలనా భవనంలో నిర్వహించిన ఎగ్జిట్‌ మీటింగ్‌లో సుగమ్‌ ఆనంద్‌ మాట్లాడారు. ఉన్నత విద్యలోనూ ప్రైవేటీకరణ పెద్ద ఎత్తున జరుగుతుందన్నారు. విశ్వవిద్యాలయాలు మనుగడ సాధించాలంటే మన సేవలను, బలాలను బహిరంగపర్చాలన్నారు. అనంతరం న్యాక్‌ టీం రూపొందించిన రిపోర్టును సీల్డ్‌ కవర్‌లో సుగమ్‌ ఆనంద్‌ కేయూ వీసీ తాటికొండ రమేష్‌కు అందించారు. కేయూ రిజిస్ట్రార్‌ ఆచార్య శ్రీనివాస్‌రావు, ఐక్యూఏసీ డైరెక్టర్‌ నర్సింహాచారి పాల్గొన్నారు.



నివేదికను వీసీ రమేష్‌కు అందజేస్తున్న న్యాక్‌టీం

ఉపయోగపడే పరిశోధనలుపై దృష్టిసారించాలి

సమాజానికి ఉపయోగపడే పరిశోధనలపై దృష్టిసారించాలని విభాగాల అధిపతులకు సూచించారు. శనివారం ఉదయం సెనెట్‌హాల్‌లో విభాగాల అధిపతుల సమావేశంలో విభాగాల వారీగా మీ పరిధిలో డిపార్టుమెంట్ల గురించి తెలియజేయాలని కోరగా పలువురు విభాగాల అధిపతులు తమ పరిశోధనలు, ప్రాజెక్టుల గురించి వివరించారు. ఈసందర్భంగా న్యాక్‌బృందంలో ఓ సభ్యుడు మాట్లాడుతూ.. కొత్త అంశాలతో సమాజానికి ఉపయోగపడేలా పరిశోధనలు చేయాలని సూచించారు. కాకతీయ యూనివర్సిటీలో 28 విభాగాలల్లో కేవలం 4వేల మంది వరకే విద్యార్థులున్నారని విద్యార్థుల కోసం మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు.

న్యాక్‌ పీర్‌ టీంను కలిసిన చీఫ్‌ విప్‌

కాకతీయ యూనివర్సిటీలో గత మూడు రోజులుగా పర్యటిస్తున్న నేషనల్‌ అసెస్‌మెంట్‌ అక్రిడిటేషన్‌ కౌన్సిల్‌ (న్యాక్‌) పీర్‌ టీం చైర్మన్‌ సుగమ్‌ ఆనంద్‌, ఇతర సభ్యులను శనివారం కేయూలో ప్రభుత్వ చీఫ్‌ విప్‌ దాస్యం వినయ్‌భాస్కర్‌ మర్యాద పూర్వకంగా కలిశారు. కాసేపు ఆ బృందంతో ముచ్చటించారు. కాకతీయ యూనివర్సిటీ విద్యాప్రమాణాలు, పరిశోధనల్లో ప్రత్యేక గుర్తింపు కలిగి ఉందని యూనివర్సిటీ గురించి తెలియజేశారు. అనంతరం న్యాక్‌ పీర్‌టీం చైర్మన్‌ ఇతర సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వీసీ రమేష్‌, బీఆర్‌ఎస్‌వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్‌, బాధ్యులు కొమురయ్య, యువజన నాయకులు డాక్టర్‌ వీరేందర్‌, లంక రాజగోపాల్‌, గొల్లపెల్లి వీరస్వామి, తిరుపతి, అనిల్‌, అరుణ్‌ ఉన్నారు.

తెలంగాణను దోచుకుంటున్న కేసీఆర్‌

- ప్రొఫెసర్‌ కోదండరాం

హన్మకొండ చౌరస్తా: యువకుల ఆత్మబలిదానాలతో వచ్చిన తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్‌ తన కుటుంబం కోసం అక్రమ, ఆర్థిక సామ్రాజ్య విస్తరణ కోసం దోచుకుంటున్నాడని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్‌ కోదండరాం అన్నారు. హనుమకొండలోని టీజేఎస్‌ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో కోదండరామ్‌ మాట్లాడారు. తెలంగాణ వనరులను, కాంట్రాక్టులను సీమాంధ్ర కాంట్రాక్టర్లకు, కార్పొరేట్లకు అమ్ముకుంటున్న దళారీ పాలకులకు గోరీ కట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల సాధన లక్ష్యంగా ఏర్పడిన తెలంగాణ జనసమితి తెలంగాణ సమాజాన్ని మళ్లీ ఏకంచేసే దిశగా ప్లీనరీ నిర్వహిస్తున్నామని అన్నారు. జూన్‌ 4న ఉదయం 10గంటలకు సూర్యాపేటలో జరిగే టీజేఎస్‌ 3వ ప్లీనరీకి పెద్ద ఎత్తున హాజరు కావాలని ఉద్యమకారులకు పిలుపునిచ్చారు. అనంతరం టీజేఎస్‌ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా చిల్లా రాజేంద్రప్రసాద్‌, ఉపాధ్యక్షుడిగా దేశబోయిన శ్రీనివాస్‌, ప్రధాన కార్యదర్శి ఎదులాపురం తిరుపతి, కార్యవర్గ సభ్యులుగా సాంబయ్య, కిరణ్‌, సాంబరాజు, మహేష్‌లు ఎన్నికైనట్లు రాజేంద్రప్రసాద్‌ తెలిపారు.


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కోదండరాం

చికిత్సపొందుతున్న వ్యక్తి మృతి

చిట్యాల: ద్విచక్ర వాహనం అదుపుతప్పి మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి (సి) గ్రామానికి చెందిన లాడె రాజబాబు (42) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రానికి చెందిన లాడె రాజబాబు శుక్రవారం రాత్రి తన వ్యవసాయ పనులను ముగించుకుని ఇంటికి వస్తున్న క్రమంలో సబ్‌ స్టేషన్‌ వద్ద ఎదురుగా వస్తున్న ఓ వ్యక్తిని తప్పించబోయి వాహనం అదుపుతప్పి కింద పడ్డాడు. దీంతో అతని తలకు బలమైన గాయం కావడంతో హుటాహుటిన చికిత్స నిమిత్తం వరంగల్‌కు తరలించారు. ఈక్రమంలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు వారు పేర్కొన్నారు. మృతిని తండ్రి రాజీరు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్న ఎస్సై ఎండీ షాఖాన్‌ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ జెడ్పీటీసీ దుర్మరణం

- మృతుడు మహబూబాబాద్‌ మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డి సోదరుడు


ప్రమాదంలో ధ్వంసమైన కారు


పురుషోత్తం రెడ్డి (ఫైల్‌)

గీసుకొండ: వరంగల్‌ జిల్లా గీసుకొండ మండలంలోని గంగదేవిపల్లి వద్ద వరంగల్‌–నర్సంపేట రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహబూబాబాద్‌ జిల్లా కేసముద్రం మండలం మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వేం పురుషోత్తంరెడ్డి(68) మృతి చెందారు. ఆయన మహబూబాబాద్‌ మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డికి స్వయానా అన్న. పురుషోత్తంరెడ్డి భార్య, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండలోని హంటర్‌రోడ్డులో ఉంటున్న వేం పురుషోత్తంరెడ్డి కేసముద్రం మండలంలోని తన స్వగ్రామం అర్పనపెల్లికి వెళ్లి తిరిగి వస్తున్నక్రమంలో మధ్నాహ్నం 2 గంటలకు గంగదేవిపల్లి వద్దకు రాగానే వరంగల్‌ వైపు వెళ్తున్న ఆయన కారును వరంగల్‌ నుంచి నర్సంపేట వైపు వెళ్తున్న నర్సంపేట డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్‌ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా ధ్వంసం కాగా డ్రైవింగ్‌ చేస్తున్న పురుషోత్తం రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు సీటు బెల్టు పెట్టుకోలేదని తెలుస్తోంది. గీసుకొండ ఎస్సై శ్వేత సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని 108 అంబులెన్స్‌లో వరంగల్‌ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్‌ జంగిలి సదయ్య అజాగ్రత్తగా, అతి వేగంగా బస్సును నడపడంతో తన భర్త మృతి చెందాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య ఉమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శ్వేత తెలిపారు. పురుషోత్తంరెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు ఉండగా ఒకరు అమెరికాలో ఉంటున్నారు. మృతదేహానికి ఎంజీఎం ఆస్పత్రి మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బంధువులు హనుమకొండ హంటర్‌రోడ్డులోని ఇంటికి తరలించారు.

పలువురి పరామర్శ..

బాధిత కుటుంబ సభ్యులు, అతడి సోదరుడు మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డిని ములుగు, వరంగల్‌ తూర్పు ఎమ్మెల్యేలు సీతక్క, నన్నపనేని నరేందర్‌, కాంగ్రెస్‌ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, గీసుకొండ ఎంపీపీ భీమగాని సౌజన్య, కాంగ్రెస్‌ నాయకులు దొమ్మాటి సాంబయ్య, పలువురు పరామర్శించారు.

రేవంత్‌ రెడ్డి సంతాపం.. నేడు రాక

వరంగల్‌: టీపీసీసీ ఉపాధ్యక్షుడు వేం నరేందర్‌ రెడ్డి సోదరుడు కేసముద్రం మాజీ జెడ్పీటీసీ వేం పురుషోత్తంరెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంపై టీపీసీసీ చీఫ్‌ రేవంత్‌ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి సంతాపం తెలిపారు. ఇదిలా ఉండగా.. వేం పురుషోత్తంరెడ్డి కుటుంబ సభ్యులను రేవంత్‌ రెడ్డి ఆదివారం పరామర్శిస్తారని కాంగ్రెస్‌ వర్గాలు తెలిపాయి.

అభివృద్ధి, సంక్షేమంలో నంబర్‌ వన్‌

- వచ్చే నెలలో మినీ టెక్స్‌టైల్‌ పార్క్‌కు శంకుస్థాపన
- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

కొడకండ్ల: తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం అన్ని రంగాల్లో దేశంలోనే నంబర్‌ వన్‌గా ఖ్యాతి గడించిందని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం కొడకండ్ల, ఏడునూతులలో జరిగిన బీఆర్‌ఎస్‌ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాల్లో ఎర్రబెల్లి ట్రస్ట్‌ చైర‌పర్సన్‌ ఉషాదయాకర్‌రావుతో కలిసి పాల్గొని ప్రసంగించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని వినూత్న ప్రజాసంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని, కాళేశ్వరం ప్రాజెక్టుతో ఎడారిలాంటి ప్రాంతాల్లోనూ సాగునీటి పరవళ్లు తొక్కుతున్నాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చెప్పినా రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సీఎం కేసీఆర్‌ మోటార్లకు మీటర్ల ఏర్పాటుకు అంగీకరించలేదని చెప్పారు. ఎన్నికల సమయం దగ్గరపడుతుండడంతో కాంగ్రెస్‌, బీజేపీలు ప్రగల్భాలు పలుకుతూ ప్రజల ముందుకొస్తున్నాయని, గడిచిన 50 ఏళ్లలో ఏం జరిగింది.. తెలంగాణ వచ్చాక కేసీఆర్‌ చేసిన అభివృద్ధిని విశ్లేసించుకోవాలని కోరారు. గెలిపించిన ఆదరించిన ప్రజల రుణాన్ని అభివృద్ధితో తీర్చుకుంటున్నానని చెప్పిన మంత్రి.. ఏడాదిలో ఇళ్లులేని వారు సొంత స్థలంలో నిర్మించుకోవడానికి మంజూరు చేయిస్తానని, నెలలోపు మిగిలిపోయిన వారికి ఫించన్‌లు మంజూరు చేస్తామని చెప్పారు. పద్మశాలీలు అధికంగా ఉన్నందున పట్టుబట్టి మినీ టెక్స్‌టైల్‌ పార్క్‌ మంజూరు చేయించానని, వచ్చే నెలలో శంకుస్థాపన చేయిస్తానని పేర్కొన్నారు. మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేస్తున్నానని వివరించారు. అనంతరం నర్సింగాపురంలో జీపీ భవన నిర్మాణం, ఎస్సీ కమ్యూనిటీ హాల్‌, సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేసారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్‌ చైర్మన్‌ కుందూరు వెంకటేశ్వర్‌ రెడ్డి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వల్మిడికి విదేశీ వాణిజ్య సంబంధాలు

- చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి వెల్లడి


చారిత్రక వస్తు సంపద


నాలుగు కాళ్ల రోలు


పురాతన వస్తువులతో రత్నాకర్‌రెడ్డి

పాలకుర్తి టౌన్‌: జనగామ జిల్లా వల్మిడి గ్రామానికి విదేశీ వాణిజ్య సంబధాలున్నట్లు ఆధారాలు లభించాయని చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం గ్రామంలో పర్యటించిన ఆయన తన పరిశోధన వివరాలను వెల్లడించారు. మూడు వేల సంవత్సరాల క్రితం వల్మిడి గుట్ట, మునులగుట్ట, పెద్దమ్మబండ కేంద్రంగా బృహద్‌ శిలాయుగం, శాతవాహనముల కాలం నాటి సంస్కృతి విలసిల్లినట్లు అనేక ఆధారాలున్నాయని చెప్పారు. రామాలయం ఉన్న గుట్ట నుంచి మంచుప్పులకు వెళ్లే దారికి రెండు వైపుల గుట్టల దిగువన విశాలమైన 'పాటి మీద'(దుబ్బ) అని పిలిచే ప్రాంతం ఉందని తెలిపారు. రాముని గుట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్న క్రమంలో ఎత్తైన రోడ్డు మార్గం వేయడానికి తీసిన కందకాల్లో, రోడ్డుకు ఇరువైపులా సాగు భూముల ఉపరితలంలో అనేక మృణ్మయపాత్రలు(మట్టి పాత్రలు) కనిపిస్తున్నాయన్నారు. జనగామ జిల్లాలోని అనేక గ్రామాల్లో శాతవాహనుల కాలం నాటి ఇటుకలు లభించాయని, వల్మిడి పాటి మీద కూడా పెద్దపెద్ద ఇటుకలు, గృహ అవసరాలు, అలంకరణకు ఉపయోగించే రౌలెటెడ్‌ వేర్‌ అని పిలుచుకునే రోమన్‌ పాత్రలు, పిల్లల చేతిలో ఇమిడే చిన్న మట్టి కుండలు, ఎరుపు, ముదురు ఎరుపు, నలుపు, బూడిద రంగులతో అనేక డిజైన్ల మట్టి పాత్రలు, ధాన్యం నిల్వకు ఉపయోగించే గాబులు, పసి పిల్లలకు పాలు తాగించే మట్టి పాత్రలు, నాణ్యత లోపించిన మట్టి పూసలు, చేతితో చేసి కాల్చిన ఎద్దు బొమ్మలు, ఒక ఫీటు కంటె పొడవైన నా లుగు కాళ్ల రాతి పీటలు, రాతి గోడ్డళ్లు, రాతి పనిముట్లు ఇక్కడ లభించాయన్నారు. గుట్టకు వెళ్లే తోవలో ఎడమ వైపు రోడ్డు నుంచి ఎర్రచెరువు మత్తడి వాగు, తునికాకు బండ వరకు చిట్టెపురాళ్లు, ఇనుప ముక్కలతో నేల ఉపరితలం కప్పి ఉందని, ఇనుము, ఉక్కు మద్దులు చేయడానికి కమ్మరి కొలుములు ఉన్నట్లు కనిపిస్తున్నాయని వివరించారు. చరిత్ర పూర్వ యుగం నుంచే వల్మిడి గుట్టలో మానవ నాగరికత ప్రారంభమైనట్లు ఆనవాళ్లు ఉన్నాయని తెలుస్తోందన్నారు. విదేశీ వ్యాణిజ్యం చేసిన నిపుణులైన కమ్మరి, కుమ్మరులు ఇక్కడ ఉన్నట్లు ఆధారాలు చెబుతున్నాయన్నారు. శాతవాహనుల కాలంలో భూమార్గంలో సూర్యాపేట మీదుగా మచిలీపట్నం ఓడ రేవు చేరి అక్కడి నుంచి జలమార్గంలో రోమ్‌ సామ్రాజ్యంలో వాణిజ్య సంబంధాలు నెరిపినట్లు తెలంగాణలో చారిత్రక ఆదారాలు లభించాయన్నారు. వల్మిడిలో లభించిన రోమన్‌ పాత్రలు, ఇక్కడ తయారైన ఇనుము, ఉక్కు ముద్దలు ఇతర దేశాలకు ఎగుమతి అయినట్లు తెలుస్తున్నదని అన్నారు. వల్మిడిలో రాక్షస గూళ్ల సమాధులు, బౌద్ధ స్తూపాలకు ఉపయోగించే లైమ్‌ స్టోన్‌ రాతి ముక్క లభించినట్లు తెలిపారు.

వల్మిడి పూర్వపు పేరు గుల్మిడి

రామాయణం రాసిన వాల్మీకి పేరుతో వల్మిడి గ్రామంగా నామం స్థిర పడిందని స్థానికులు చెబుతున్నట్లుగా ఆధారాలు ఏమీ లభించలేదని రత్నాకర్‌రెడ్డి తెలిపారు. అయితే శాతవాహనుల కాలంలో ఐదు గ్రామాలను కలిపి నియమించే అధిపతిని గుల్మికుడు అంటారని, నాటి గుల్మిడి నేడు వల్మిడిగా ప్రసిద్ధి చెంది వుండవచ్చని అన్నారు.

వేర్వేరు చోట్ల నీటిలో మునిగి ముగ్గురి మృతి

నెక్కొండ: వరంగల్‌ జిల్లా నెక్కొండ మండలంలోని గొల్లపల్లిలో ఓ బాలుడు కుంటలో పడి మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన పెద్దపల్లి కిరణ్‌– కవితలకు కుమారుడు రాజేష్‌ (12), కుమార్తె ఉన్నారు. శుక్రవారం సాయంత్రం బాలుడు బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. దీంతో బాలుడి ఆచూకి కోసం వెళ్లగా గ్రామ శివారు కుంటలో రాత్రి శవమై తేలాడు. బాలుడు బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి చెందాడని భావిస్తున్నారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని శవ పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించామని ఎస్సై జానీపాష తెలిపారు.

మల్లన్న గండి రిజర్వాయర్‌లో..


శేఖర్‌ మృతదేహం

చిల్పూర్‌/ దేవరుప్పుల: జనగామ జిల్లా చిల్పూరు మండలం గార్లగడ్డతండా గ్రామ పంచాయతీ పరిధిలోని మల్లన్న గండి రిజర్వాయర్‌లో ప్రమాదవశాత్తు మునిగి శనివారం ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్సై బొల్లం వినయ్‌కుమార్‌, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. దేవరుప్పుల మండలం ధర్మగడ్డ తండాకు చెందిన భూక్య శేఖర్‌(20) కిట్స్‌ కళాశాలలో బీటెక్‌ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శనివారం పరకాలకు చెందిన తోటి మిత్రులు కార్తీక్‌, విశ్వాస్‌లతో కలిసి మల్లగండికి చేరుకున్నారు. ఈక్రమంలో శేఖర్‌ నీటిలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో మునుగుతుండడంతో స్నేహితులు కాపాడమంటూ అరవడంతో చుట్టు పక్కల రైతులు చేరుకుని గాలించగా శవమై కనిపించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా.. మల్లన్నగండి రిజర్వాయర్‌లో మృతిచెందిన విద్యార్థి భూక్య శేఖర్‌ స్వగ్రామమైన ధర్మగడ్డతండా(దేవరుప్పుల)లో శనివారం విషాదం అలుముకుంది. ధర్మగడ్డతండాకు చెందిన భూక్య మేర్‌సింగ్‌ ఇరవై ఏండ్ల క్రితం కుటుంబంతో సహా హనుమకొండకు వెళ్లి ఆటో నడిపేవాడు. ఈ క్రమంలో మూడేళ్ల కిందట మేర్‌సింగ్‌ రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో భార్య లక్ష్మీ కుమారుడు శేఖర్‌ చదువుకోసం ఇంటింటా కూలీ పనిచేస్తుంది. శుక్రవారం ఉదయం ధర్మగడ్డలో వారసత్వం భూమిని పెద్దమనుషుల సమక్షంలో చర్చించేందుకు వచ్చి, స్నేహితులతో కలిసి వెళ్లి నీటిలో మునిగి విగతజీవిగా మారాడు.

సమ్మక్క బ్యారేజీలో పడి యువకుడు..

కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద గోదావరిపై నిర్మించిన సమ్మక్క సాగర్‌ బ్యారేజీలో చేపల వేటకు వెళ్లిన తూరం రామకృష్ణ నీటిలో మునిగి మృతిచెందాడు. రామకృష్ణ తండ్రి శ్రీను, ఎస్సై సురేష్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రాజన్నపేటకు చెందిన ముగ్గురు వ్యక్తులు సమ్మక్క సాగర్‌ బ్యారేజీ వద్దకు చేపల వేటకు వెళ్లారు. చేపలు పడుతున్న క్రమంలో రామకృష్ణ కాలు జారి నీటిలో పడిపోయాడు. తోటి స్నేహితులు రక్షించడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. తల్లిదండ్రుల ఫిర్యాదుతో ఎస్సై సురేష్‌ సహాయక చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికితీశారు. ఏటూరునాగారంలో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

హౌస్‌ సర్జన్‌, పీజీ వైద్యుల స్టైఫండ్‌ పెంపు

ఎంజీఎం: ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యవిద్యలో భాగంగా విధులు నిర్వర్తించే హౌస్‌సర్జన్లు, పీజీ విద్యార్థులు, సీనియర్‌ రెసిడెన్స్‌ వైద్యుల స్టైఫండ్‌ను 15శాతం పెంచుతూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

కోర్సు	ప్రస్తుత స్టైఫండ్‌	పెంచిన స్టైఫండ్‌
హౌస్‌సర్జన్‌ మెడికల్‌	22,527	25,906
హౌస్‌సర్జన్‌ డెంటల్‌	22,527	25,906
పీజీ డిగ్రీ		
మొదటి సంవత్సరం	50,686	58,289
రెండో సంవత్సరం	53,503	61528
మూడవ సంవత్సరం	56,319	64,767
పీజీ డిప్లొమా		
మొదటి సంవత్సరం	50,686	58,289
రెండో సంవత్సరం	53,503	61,528
సూపర్‌ స్పెషాలిటీ		
మొదటి సంవత్సరం	80,500	92,575
రెండో సంవత్సరం	84,525	97,204
మూడో సంవత్సరం	88,547	10,11829
ఎండీఎస్‌		
మొదటి సంవత్సరం	50,686	58,289
రెండో సంవత్సరం	53,503	61,528
మూడో సంవత్సరం	56,319	64,767
సీనియర్‌ రెసిడెంట్స్‌	80,500	92,575

టీఎస్‌ ఐసెట్‌ ప్రశాంతం



ప్రవేశపరీక్షకు ప్రశ్నపత్రం సెట్‌ను ఎంపిక చేస్తున్న కేయూ వీసీ రమేష్‌

కేయూ క్యాంపస్‌: రాష్ట్రంలోని ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ఈవిద్యాసంవత్సరం (2023–2024) ప్రవేశాలకుగాను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన టీఎస్‌ ఐసెట్‌ వరంగల్‌ జిల్లాలోని 9 పరీక్ష కేంద్రాల్లో శనివారం ప్రశాంతంగా ముగిసింది. మొదటి సెషన్‌లో 2,100 మంది విద్యార్థులకు గాను 1,965మంది (93.6శాతం) హాజరయ్యారు. రెండో సెషన్‌లో 2,001 మందికిగాను 1,948మంది(92.8శాతం) మంది హాజరయ్యారని సెట్‌ కన్వీనర్‌, కేయూ కామర్స్‌ అండ్‌ బిజినెస్‌ మేనేజ్‌మెంట్‌ కళాశాల ప్రొఫెసర్‌ వరలక్ష్మి తెలిపారు. నర్సంపేటలోని పరీక్షాకేంద్రంలో మొదటి సెషన్‌లో 153మందికిగాను 146మంది(95.4శాతం)హాజ రుకాగా.. రెండో సెషన్‌లో 152మందికిగాను 141మంది (92.8) శాతం హాజరైనట్లు వెల్లడించారు. కాగా, జూన్‌ 5న టీఎస్‌ ఐసెట్‌ ప్రిలిమినరీ కీ విడుదల చేసి, జూన్‌ 6నుంచి 8వ తేదీవరకు అభ్యంతరాలను స్వీకరించి, 20న ఫలితాలను వెల్లడించనున్నట్లు కన్వీనర్‌ వరలక్ష్మి పేర్కొన్నారు.

ప్రాణం తీసిన చేపలవేట


ప్రవీణ్‌ (ఫైల్‌)

గూడూరు: చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతిచెందిన సంఘటన మహబూబాబాద్‌ జిల్లా గూడూరు మండలంలోని ఏపూరు గ్రామంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపూరుకు చెందిన బానోతు ప్రవీణ్‌ (28) మురారి అనే వ్యక్తి కల్సి సమీప పాకాలవాగులో విద్యుత్‌ వైర్‌ అమర్చి చేపలు పట్టే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో వాగునీటిలో విద్యుత్‌ వైర్‌ పెట్టిన విషయం మరిచారు. చేపల కోసం వెళ్లిన ఇద్దరిలో ప్రవీణ్‌ నీటిలోకి దిగాడు. ఆ సమయంలో విద్యుదాఘాతం సంభవించి అక్కడిక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనను గుర్తించిన మురారి బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. విషయం తెల్సుకున్న ఎస్సై దిలీప్‌ సిబ్బందితో అక్కడికి చేరుకొని సంఘటన జరిగిన తీరుపై ఆరా తీశారు. శవాన్ని పోస్టుమార్టానికి తరలించి, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య సోనుతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.